# “బరబ్బా” నా లేక “యేసునా”?

మత్తయి 27:18- ఎవరిని విడుదల చేయవలెనని మీరు కోరుచున్నారు? బరబ్బనా లేక క్రీస్తనబడిన యేసునా? అని వారిని అడిగెను.యేసు మరియు బరబ్బా గురించిన కొన్ని విషయాలు మీతో పంచుకోవాలనుకుంటున్నాను. ఏదైనా ఒక విషయం ఎంతో ముఖ్యమైనదైతేనే తప్ప నాలుగు సువార్తలలో మనకు కనబడదు. ఈ బరబ్బాను గురించి నాలుగు సువార్తల్లోను కనపడుతుంది. అంటే ఈ బరబ్బా వృత్తాంతం ఎంతో ముఖ్యమైనదని నలుగురు సువార్తికులు ఏకగ్రీవంగా చెప్పుచున్నారు.(మత్తయి 27:15-26, మార్కు 15:6-15 లూకా23:13-25, మరియు యోహాను 18:39-40.)

## 1. ఎవరు ఈ బరబ్బా?

ఎందుకు పరిశుద్ధాత్మ దేవుడు బరబ్బాను గురించి నాలుగు సువార్తలలోను వ్రాయించి బరబ్బాకు అంత ప్రముఖమైన స్థానాన్ని ఇచ్చాడు? దీని వెనుక వున్న కారణం మనం తెలుసుకోవడం మనకు ఎంతో అవసరం. ఆ కాలంలో పేరు మోసిన ఖైదీ ఒకడు చెరసాలలో ఉన్నాడు. అతడి పేరు బరబ్బ. ఈ బరబ్బ ఆ నగరంలో రోమా సామ్రాజ్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటు జరిగించినందుచేత, హత్యలు చేసినందుచేత చెరసాలపాలై మరణశిక్షకు గురయినవాడు కనుక ఏక్షణంలోనైనా అతడు మరణించే పరిస్థితులలో ఉన్నాడు. యేసును బంధించి పిలాతు దగ్గరకు తీర్పుకు తీసుకొని వచ్చినపుడు, సాక్ష్యాధారాలను పరిశీలించడమెలాగో పిలాతుకు తెలుసు కాబట్టి త్వరగానే యేసు నిర్దోషి అని గ్రహించాడు. గనుక ప్రజలు పోగై వచ్చినప్పుడు పిలాతు వారినిలా అడిగాడు- “నేనెవణ్ణి మీకు విడుదల చేయాలని కోరుతున్నారు? బరబ్బనా? క్రీస్తు అనే యేసునా?" మీకు ఎవ్వరు కావాలి? జీవాధిపతి యేసా లేక నరహంతకుడు బరబ్బానా? బరబ్బా తిరుగుబాటుదారుడు, హంతకుడు కాబట్టి యేసును విడుదల చెయ్యాలని ప్రజలు అడుగుతారన్న ఆశతో పిలాతు ఇలా అన్నాడు. యేసుని తన చేతుల్లోనుంచి వదిలించుకోవాలని పిలాతు చూశాడు. అ పండుగ సమయంలో పిలాతు వారికి ఎవరైనా ఒకడిని విడుదల చేయడం తప్పనిసరి. అయితే వారంతా ఏకగ్రీవంగా “ఈ యేసు ప్రాణాన్ని తీసెయ్యండి. మాకు బరబ్బాను విడుదల చేయండి!" అని అరిచారు. అందును బట్టి బరబ్బకు ప్రత్యామ్నాయంగా యేసు మరణించాడు.

## 2. ప్రత్యామ్నాయం యేసు

యేసు మనందరి కోసం సిలువపై చనిపోయినప్పుడు, అతడు మనకుప్రత్యామ్నాయం అయ్యాడు. ఆయన మన స్థానాన్ని తీసుకొని మన కొరకు చనిపోయాడు. యేసు మన స్థానంలో మన పాపాలకు ప్రత్యామ్నాయంగా సిలువలో ప్రాయశ్చిత్తాన్ని చేశాడు. మనకు ప్రత్యామ్నాయంగా ఆయన సిలువలో మన పాపాలకు ప్రాయశ్చిత్తం ఎలా చేశాడో మనకు వ్యక్తిగతంగా అర్ధం కావడం కష్టం. అందుకే మనం మరణించివలసిన స్థానంలో ప్రభువు మరణించినందున మనం ఎలాగు మరణంలోనుండి జీవంలోనికి దాటామో మనకు తేలికగా అర్ధం కావడానికి ఈ బరబ్బా ఉదాహరణ ద్వారా పరిశుద్ధాత్మ దేవుడు మనకు తెలియజేయు చున్నాడు.

మరణ శిక్ష విధించబడి ఖచ్చితంగా మరణించ వలసినవాడు మరియు విడిపించుకోవడానికి ఎటువంటి అవకాశం లేని బరబ్బా తాను ఏమి చేయకుండా, తాను బ్రతకడానికి ఎటువంటి అర్హత లేకపోయినా, దేవుని ఉచితమైన కృప చేత చివరి క్షణాలలో యేసుద్వార నేరస్తుడైన బరబ్బా ఎంత అద్భుతంగా విడిపించబడ్డాడో మనకు అర్ధమగుటకే బరబ్బాను గురించి పరిశుద్ధ గ్రంధంలోని నాలుగు సువార్తలలో వ్రాయించాడు. మన కోసం యేసు చేసిన గొప్ప త్యాగం యొక్క విలువ ఏమిటో మనం తెలుసుకోవడానికి ఈ బరబ్బా అను భాగం మనకు సహాయం చేస్తుంది.

## 3. బరబ్బా స్థానంలో మరణించిన యేసు ఎవరు?

యేసు మరియు బరబ్బా ఇద్దరూ సమాంతర జీవితాలను గడుపుతున్నారని మనం గమనించవచ్చు. యేసు పరలోక రాజ్యం స్థాపన కొరకు ప్రయత్నం చేస్తున్న జీవాధిపతి. యేసునుగూర్చి యోహాను ఈ విధంగా చెప్పుచున్నాడు. (యోహాను 1:29 ఇదిగో లోకపాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱపిల్ల.) కాబట్టి యేసు సర్వ మానవాళి పాప పరిహారం కొరకు అనగా బరబ్బాలాంటి పాపులమైన మనలను రక్షించి మనకు బదులుగా ప్రాణం పెట్టుటకు ఈ లోకం వచ్చిన దేవుని గొర్రెపిల్ల. అయితే యూదా ప్రజలు యేసును తమను పరిపాలించబోయే రాజుగా ఊహించుకున్నారు. రోమా పరిపాలన అంతమొందించి దావీదు రాజు మాదిరిగా రాజ్య పరిపాలన చేసే మెస్సియాఅనుకున్నారు. పిలాతు కూడా అదే విధంగా మొదట యేసును రోమా తిరుగుబాటు దారుడుగా భావించాడు. అందుకే యేసును బంధించినపుడు పిలాతు “నీవు గలలియుడవా?" అని అడిగాడు (లూకా 23:6 పిలాతు ఈ మాట విని ఈ మనుష్యుడు గలిలయుడా అని అడిగి...) పిలాతు ఎందుకు ఇలా అడిగాడు. కారణం ఏమంటే, అదే సమయంలో గలిలయ ప్రాంతంలో రోమా సామ్రాజ్యం మీద తిరుగుబాటు దారుడుగా ఉన్న యూదా అనే ఒకడు ఉన్నాడు. అతనిని గలలియుడైన యూదా అని పిలిచేవారు. (అపో 5:37 వానికి తరువాత జనసంఖ్య దినములలో గలిలయుడైన యూదా అను ఒకడు వచ్చి, ప్రజలను తనతో కూడ తిరుగుబాటుచేయ ప్రేరేపించెను) పిలాతు బహుశా అతడే ఈ యేసు కావచ్చు అని అనుమానంతో నీవు గలలియుడవా అని అడిగాడు. అయితే యేసు తాను ఎవరో పిలాతుకు స్పష్టంగా చెప్పాడు. (యోహాను 18:36 యేసు నా రాజ్యముఈ లోకసంబంధమైనది కాదు; నా రాజ్యము ఈ లోకసంబంధమైనదైతే నేను యూదులకు అప్పగింపబడకుండునట్లు నా సేవకులు పోరాడుదురు గాని నా రాజ్యము ఇహసంబంధమైనది కాదనెను.) కాబట్టి యేసు నిజముగానే పాప పరిహారం చెల్లించడానికి వచ్చిన దేవుని గొర్రెపిల్ల అని పిలాతుకు స్పష్టమై పోయింది.

## 4. బరబ్బా ఎవరు?

మత్తయి 27:16- ప్రకారం బరబ్బా ఒక ప్రసిద్ధుడైన ఖైదీ అనగా కరడుగట్టిన రాజకీయ నేరస్తుడు. ఇటువంటి రోమా రాజకీయ తిరుగుబాటు దారులను “జీలట్లు" అని పిలిచేవారు. యోహాను 18:40 ప్రకారం బరబ్బా బందిపోటుదొంగ. మార్కు 15:7 మరియు లూకా 23:18-19 ప్రకారం నరహంతకుడు. కాబట్టి బరబ్బా భూలోక సంబంధమైన రాజ్యం కోసం ప్రయత్నం చేస్తున్న రాజ ద్రోహి, నేరస్తుడు, బందిపోటు మరియు నరహంతకుడు కాబట్టి బరబ్బా పాపానికి బానిస. కాబట్టి బరబ్బా ఖచ్చితంగా మరణానికి పాత్రుడు. పాపానికి వచ్చుజీతం మరణం (రోమా 6:23).

## 5. పిలాతు అన్యాయపు తీర్పు

(మత్తయి27:18 ఎవరిని విడుదల చేయవలెనని మీరు కోరుచున్నారు? బరబ్బనా లేక క్రీస్తనబడిన యేసునా? అని వారిని అడిగెను.) క్రీస్తు అనబడిన యేసా లేదా బరబ్బానా అని పిలాతు అడుగుచున్నాడు. ఇరువురు ఖైదీలు పిలాతుముందు నిలబెట్టబడ్డారు. ఇరువురి గురించి స్పష్టంగా తెలిసిన పిలాతు ఈ ప్రశ్న అడుగుతూ ఉన్నాడు. బరబ్బానా లేక క్రీస్తు అనబడిన యేసునా? బరబ్బా ఒక బందిపోటు దొంగ అని, రోమా ప్రభుత్వానికి వ్యతిరేకంగా విప్లవం లేపిన రాజకీయ తిరుగుబాటు దారుడు అని పిలాతుకు తెలుసు. యేసు అభిషిక్తుడైన క్రీస్తు అనగా మెస్సియా అని పిలాతుకు తెలుసు. అదే మాట ప్రజలకు కూడా తెలియునట్లుగా క్రీస్తు అనబడిన యేసునా? అని అడుగుచున్నాడు.

యేసు నిర్దోషి అని కూడా స్పష్టంగా తెలిసిన పిలాతు, రోమా గవర్నర్ పదవిలో యేసును విడుదలచేయుటకు పూర్తి అధికారం గలిగిన ఒక ప్రభుత్వ అధికారిగా ఉండి కూడా ప్రజల అభిప్రాయం ప్రకారం విడుదల ప్రకటించడం ఎంతో సిగ్గుమాలిన పని.ఒక దుర్మార్గునితో పాటు నిందారహితుడైన యేసును ఒకే త్రాసులో తూయడం ఎంత అన్యాయం. ఒక ప్రక్క యేసు నిర్దోషి అనే పిలాతే చెప్పుచునాడు. మరొక ప్రక్క దోషితో సమానంగా నిలబెట్టుచున్నాడు. కారణం ప్రజలు పిర్యాదు చేస్తే తన పదవి ఎక్కడ ఊడుతుందో అని భయం. అందుకే ఇది అన్యాయపు తీర్పు అని యెషయా ప్రవక్త చెప్పియున్నాడు (యెషయా 53:8 అన్యాయపు తీర్పునొందినవాడై అతడు కొనిపోబడెను.) పిలాతులాంటి వారు అనేకులు ఈ దినాలలో యేసు నిజరక్షకుడు అని తెలిసి కూడా వితర్కములతో వ్యర్ధ వాదములతో యేసుని అంగీకరించక త్రుణీకరించుచున్నారు.

## 6. బరబ్బా విడుదల, యేసుకు సిలువ శిక్ష

(మత్తయి 27:26 అప్పుడతడు వారు కోరినట్టు బరబ్బను వారికి విడుదల చేసి, యేసును కొరడాలతో కొట్టించి సిలువవేయ నప్పగించెను.) అసలు తాను చేసిన భయంకరమైన హత్యలు నేరాల కొరకు సిలువపై బరబ్బా మరణించవలసి యున్నది. అయితే భయంకరమైన పాపియైన బరబ్బా విడుదల చేయబడి, నిందా రహితుడు, నిష్కల్మషమైనవాడు యేసు అతని స్థానంలో మరణించాడు. అనగా క్రీస్తు ద్వారా బరబ్బా బ్రతికింప బడ్డాడు. మనం కూడా మన పాపముల నిమిత్తం మరణించ వలసిన వారమై యుండగా క్రీస్తునందు మనలను దేవుడు బ్రతికించాడు. (1కొరి 15:22 ఆదామునందు అందరు ఏలాగుమృతిపొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రదికింపబడుదురు.) ప్రజలు బరబ్బను కోరుకొన్నారు కనుక యేసు సిలువలో మేకులకు కొట్టబడ్డాడు. అనగా ప్రజల చేసిన తప్పులు యేసుకు సిలువ మేకులుగా* మారినవి. అనగా లోకం చేసిన తప్పే యేసుకు సిలువగా మారినది. ప్రియ దేవుని బిడ్డలారా! మనం తప్పు చేసిన ప్రతిసారి మన తప్పులు యేసుకు సిలువ మేకులుగా మారుచున్నవని మనం గ్రహించాలి. అనగా మనం మన తప్పుల ద్వారా పాపాల ద్వారా యేసును మరల మరల సిలువ వేయుచున్నామేమో పరిశీలిచుకుందాం. వాస్తవం పరిశీలిస్తే ప్రజలందరు బరబ్బాలాంటి పాపులైనవారే. అందుకే పరిశుద్ధుడైన యేసును వదిలి, తమలాంటి పాపియైన బరబ్బాను కోరుకున్నారు.

(1యోహాను 3:5 పాపములను తీసివేయుటకై ఆయన ప్రత్యక్షమాయెనని మీకు తెలియును; ఆయనయందు పాపమేమియు లేదు.)యేసు కేవలం ఒక్క బరబ్బ కొరకు మాత్రమే చనిపోలేదని, తమలాంటి వారందరి కొరకు సిలువ వేయబడినాడని ప్రజలకు తెలియదు.

## 7. మన ఎంపిక ఎలా ఉంది

భూసంబంధమైన బరబ్బాలాంటి పాప జీవితాన్నా? లేదా పాప పరిహారం చేసి మనకు నిత్య మరణంతప్పించి రక్షణ అందించుటకు వచ్చిన రక్షకుడైన యేసునా? ఒక్క సారి బరబ్బా స్థానంలో మనలను ఊహించుకుందాం. బరబ్బా మాదిరిగా జీవితంలో ఎన్నో పాపాలు తప్పులు చేసి మరణానికి పాత్రులమై యున్నాము. బరబ్బా మాదిరిగా ఏమాత్రం జీవితంపై ఆశలేక, ఏ క్షణంలోనైనా మరణానికి లోనైయ్యే పరిస్థితిలో ఉన్న మనలను, నిరపరాధిగా ఉన్న వ్యక్తి, పూర్తిగా నిర్దోషియైన యేసు పక్కన నిలబెట్టినప్పుడు, ప్రజలు ఎవరిని కోరుకుంటారని నీవు భావిస్తావు? యేసునా లేదా నిన్నా? ఖచ్చితంగా యేసునే అని నీవు భావిస్తావు. కారణం మనం చేసిన పాపం అంత భయంకరమైంది. ఇక నీకు ఏ ఆశలేని సమయంలో అకస్మాత్తుగా ప్రజలు నీ విడుదల కోసం అరిచారు అని అంటే ఇది ఒక అద్భుతం, నీవు నమ్మలేని వివరించలేని అద్భుతమని నీకు కూడా తెలుసు. మరణించవలసిన నీకు జీవించడానికి మరో అవకాశం అనుగ్రహించ బడినది  అని నీవు అనుకోవా? అనీతిమంతులమైన మనలను కాపాడుట కొరకు నీతిమంతుడు బలైనాడు. భక్తిహీనులమైనమనకొరకు ఆయన చనిపోయెను. (1 పేతురు 3:18 ఏలయనగా మనలను దేవునియొద్దకు తెచ్చుటకు, అనీతిమంతుల కొరకు నీతిమంతు డైన క్రీస్తు శరీరవిషయములో చంపబడియు...)

ఆవును ప్రియ స్నేహితుడా! యేసు ద్వారా మనకు మరో జీవితం అనుగ్రహించబడినది. ఇక బరబ్బా స్వేచ్ఛగా జీవించవచ్చు. అతడి పాపాలని నేరాలన్నీ రద్దు చేయబడినవి. ఇక బరబ్బా ఆనందం ఏమని వర్ణింపగలం. క్రీస్తునందు నూతన జీవితం పొందుకున్నవారి ఆనందం ఇదే. ఈ ఆనందం శాశ్వతంగా మనకు కావాలంటే మన పాపముల కొరకు యేసు చనిపోయాడని, ఆయనను మన రక్షకునిగా మనము ఒప్పుకుంటామని నమ్ముతున్నప్పుడు మనకు ఇది జరుగుతుంది. మనమందరమూ పాపములో జీవిస్తున్నాము మరియు మరణానికి అప్పగించబడ్డాము మరియు నరకం యొక్క జ్వాలలలో శాశ్వతకాలం వరకు హింసించబడ బోతున్నాము.అటువంటి మనము స్వేచ్ఛగా నిలిచాం ఎందుకంటే  యేసు మన స్థానంలో మరణించాడు. (రోమా 10:9 అదేమనగా యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలోనుండి ఆయ నను లేపెనని నీ హృదయ మందు విశ్వసించినయెడల, నీవు రక్షింపబడుదువు.)

యేసు సిలువపై మన స్థానాన్ని తీసుకున్నప్పుడు అనగా యేసు మన ప్రత్యామ్నాయం కావటం వలన మనము రక్షింపబడితిమి. బరబ్బకు బదులుగా చనిపోవడానికి యేసు తనను తాను సిద్ధపరచుకొన్నాడు కాబట్టి, యేసు బరబ్బకు బదులుగా చనిపోయాడు. (యెషయా 53:4 నిశ్చయముగా అతడు మన రోగములను భరించెను మన వ్యసనములను వహించెను అయినను మొత్తబడినవానిగాను దేవునివలన బాధింపబడిన వానిగాను శ్రమనొందిన వానిగాను మనమతనిని ఎంచితిమి. 5 మన యతిక్రమక్రియలనుబట్టి అతడు గాయపరచ బడెను మన దోషములను బట్టి నలుగ గొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతనిమీద పడెను అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగు చున్నది.)

ఎవరైనా ఒక మంచి వ్యక్తి మరణిస్తుంటే అతని స్థానంలో ఎవరైనా మరణించడానికి ముందుకు వస్తే అందులో ఒక అర్థం ఉంది. కాని ఏ మాత్రం క్షమించబడటానికి అర్హతలేని ఒక వ్యక్తి కొరకు అతనికి ఏమాత్రం సంబంధ బాంధవ్యంలేని ఇంకొకరు అతని స్థానంలో మరణించడం అరుదైన విషయం. (రోమా 5:6-9) ఏలయనగా మనమింక బలహీనులమై యుండగా, క్రీస్తు యుక్తకాలమున భక్తిహీనుల కొరకు చనిపోయెను. నీతిమంతుని కొరకు సహితము ఒకడు చనిపోవుట అరుదు; మంచివానికొరకు ఎవడైన ఒకవేళ చనిపోవ తెగింప వచ్చును. అయితే దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడి పరచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను. కాబట్టి ఆయన రక్తమువలన ఇప్పుడు నీతిమంతులముగా తీర్చబడి, మరింత నిశ్చయముగా ఆయన ద్వారా ఉగ్రతనుండి రక్షింప బడుదుము.) బరబ్బా అను అతి క్రూరమైన క్రిమినల్ కోసం యేసు మరణించాడు. కేవలం బరబ్బా కొరకు మాత్రమేకాదు ప్రపంచంలో ఉన్న పాపాత్ములందరి కొరకు ఆయన సిలువలో మరణించాడు. "ముందు మీరు మారండి ఆతరువాత నేను మీ కొరకు మరణిస్తాను*" అని యేసు చెప్పలేదు. మనం మారకుండానే మనమింకా పాపులముగా ఉండగానే ఆయన మన కొరకు మరణించాడు. మనలో ప్రతి ఒక్కరికొరకు ఆయన చనిపోయాడు. యేసు ఈ ఉదయకాలం మన స్థానంలో అడుగుపెట్టి మనకు ప్రత్యామ్నాయంగా సిలువలో మరణించుటకు ఇష్టపడు చున్నాడు. మీ జీవితాన్ని ఆయనకు అప్పగించమని ప్రభువు మిమ్మల్ని పిలిచినట్లయితే, మీరు చేయాల్సిందల్లా యేసు మీ కోసం నిజంగా మీ స్థానంలో చనిపోయాడని నమ్మడమే. నీ కోసమే ఆయన ప్రాణ త్యాగం చేశాడని ప్రజలందరి ముందు ఆయన నీ రక్షకుడని ఒప్పుకోగలవు. ఆయన ప్రాణ త్యాగము నీ కోసమే అని ఆయన కలువరి పయనం నీ కొరకేనని నీ పాపమే ఆయనకు సిలువగా మారినదని అన్యాయపు తీర్పునే ఇచ్చిందని నీవు హృదయంలో గ్రహించాలి. ఆ రీతిగా ప్రభువును రక్షకుడుగా ఒప్పుకోవడానికి యేసును హృదయంలోచేర్చుకోవడానికి పరిశుద్ధాత్మ దేవుడు మనలను ఆయుత్త పరచును గాక! ఆమెన్!!